క్లుప్తంగా

శశిధర్ రెడ్డికి పరామర్శ


శశిధర్‌రెడ్డిని పరామర్శిస్తున్న హరిప్రసాద్‌రెడ్డి

తిరుపతి సిటీ: చిత్తూరు జిల్లా బంగారుపాళెంలో మామిడి రైతుల సమస్యలను తెలుసుకునేందుకు జిల్లా పర్యటనకు విచ్చేసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసేందుకు అక్కడికి చేరుకున్న యువజన విభాగం నాయకుడు శశిధర్‌రెడ్డిపై పోలీసులు విచక్షణా రహితంగా దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన ఆయనను వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వి.హరిప్రసాద్ రెడ్డి గురువారం పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బీరేంద్ర వర్మ, మురళీధర్, హేమంత్, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు జంగంరెడ్డి కిషోర్ దాస్, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేట్ స్థాయిలో ఉచిత విద్య

చంద్రగిరి: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేస్తున్నామని ప్రభుత్వ బాలికల పాఠశాల హెచ్ఎం వెంకటరమణా రెడ్డి అన్నారు. గురువారం మండలవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించారు. అందులో భాగంగా స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాల, కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈఓ లలితకుమారి పాల్గొని మాట్లాడారు.

ఈఎస్ఐ సేవలను సద్వినియోగం చేసుకోండి


శిబిరంలో పాల్గొన్న ఈఎస్ఐ వైద్యులు, సిబ్బంది

తిరుపతి తుడా: ఈఎస్ఐ చందా చెల్లించే కార్మికులు, లబ్ధిదారులు సంస్థ అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.శ్యాంబాబు సూచించారు. స్థానిక శ్రీనివాసం యాత్రికుల సముదాయంలో పనిచేసే ఈఎస్ఐ లబ్ధిదారు లు, సిబ్బంది కోసం గురువారం మెడికల్ క్యాంపు నిర్వహించి సుమారు 135 మందికి వైద్య సేవలు అందించారు. శిబిరంలో ఆర్ఎంఓ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, క్యాంపు ఇన్‌చార్జ్ డాక్టర్ బాలాజీ, వైద్యులు సోనియా, శ్రీలత, సిబ్బంది పాల్గొన్నారు.

100 చిత్రాన్ని ఆదరించండి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నటులు

తిరుపతి కల్చరల్: మొగలిరేకులు టీవీ సీరియల్ నటుడు ఆర్‌కే సాగర్ హీరోగా నటించిన చిత్రం 100 సినిమా ప్రజలంతా ఆదరించి ఆశీర్వదించాలని హీరో మిత్ర బృందం ఆర్కాట్ కృష్ణప్రసాద్, నటులు వేణుగోపాల్ రాజు, శాంబోల హరినాథ్ పిలుపునిచ్చారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు 100 చిత్రం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓంకార్ దర్శకత్వంలో తెరకెక్కిన 100 సినిమా ఈ నెల 11న విడుదలవుతోందన్నారు.

ఆధునికీకరణ పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిపాలనా భవనంలో పలు సెక్షన్ల ఆధునికీకరణ పనులకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో గురువారం ఎస్టాబ్లిష్‌మెంట్ 1, 2, 3 సెక్షన్ల మరమ్మతు పనులను వర్సిటీ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు ప్రారంభించారు. ఇందులో ప్రధానంగా కంప్యూటర్, శీతలీకరణ, ఆన్‌లైన్ సదపాయం వంటివి ప్రత్యేకంగా అమర్చనున్నారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారులు పాల్గొన్నారు.

అన్నదానం

తిరుపతి అన్నమయ్యసర్కిల్: అలిపిరి గరుడ విగ్రహం వద్ద గురువారం మధ్యాహ్నం గురుపౌర్ణమి సందర్భంగా హిందూ ధర్మ ప్రచార భజన కళాకారులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరణి భక్తులకు అన్నదానం చేశారు. జానపద వృత్తి కళాకారుల సంఘం జాతీయ అధ్యక్షుడు పులిమామిడి యాదగిరి ఆధ్వర్యంలో ప్రతి నెలా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

హోమ్ స్టేల్లో తనిఖీలు

తిరుపతి క్రైమ్: నగరంలోని ఈస్ట్ పరిధిలో ఉన్న పలు హోమ్ స్టేలపై ఈస్ట్ సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో గురువారం దాడులు నిర్వహించారు. నగరంలో అసాంఘిక కార్యకలాపాలు నియంత్రించేందుకు ఇకపై నిరంతరం హోం స్టేలను తనిఖీలు నిర్వహిస్తామన్నారు. సక్రమంగా నిర్వహించుకోవాలన్నారు. ఏదైనా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుంటే వీటి నిర్వాహకులను కూడా కేసుల్లో చేరుస్తామని హెచ్చరించారు. మీ దగ్గరకు వచ్చే ప్రతి వ్యక్తి ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్, అడ్రస్ సేకరించాలన్నారు. ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

మితిమీరితే అనర్థమే..

గతంలో విశాలమైన గృహాలు, భవంతుల్లో కుటుంబ సభ్యులు నివాసముండేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితులు మారిపోతున్నాయి. క్రమంగా పట్టణీకరణ పెరుగుతుండడంతో పట్టణాలు, నగరాల్లో ఇరుకు గదుల్లో, సరైన వసతులు లేని నివాసగృహాల్లో బతుకులు వెళ్లదీస్తున్నారు. ఇక పేద, దిగువ మధ్య తరగతి కుటుంబాల పరిస్థితులు చెప్పనక్కర్లేదు. దీనికంతటికీ కారణం నానాటికీ పెరుగుతున్న జనాభా.

- తిరుపతి నగరంలో పెరుగుతున్న జనాభా
- నగరంలో రోజురోజుకూ భారీస్థాయిలో పెంపు
- 2025 జూన్ నాటికి 7.75 లక్షల మార్కుకు చేరిందంటున్న అధికార వర్గాలు
- 2027 నాటికి 10 లక్షలు చేరుతుందని అంచనా
- నేడు ప్రపంచ జనాభా దినోత్సవం



తిరుపతి తుడా: భూమిపై పరిమితంగా ఉన్న సహజ వనరులు వినియోగించుకుంటూ అపరిమితంగా పెరిగిపోతున్న జనాభాకు ఆహారం .. నివాసం కల్పించుకోవడం కష్టతరమవుతోంది. దీనికి తోడు వ్యవసాయ భూములు సైతం నివాస సముదాయాలుగా మారుతున్నాయి. అటవీ విస్తీర్ణం క్రమంగా తగ్గుతోంది. రానున్న రోజుల్లో పరిస్థితులు మరింత క్లిష్టతరం అవుతాయన్న సంకేతాలు వెలువడుతున్నాయి. దీనికంతటికీ పరిష్కార మార్గం అపరిమితంగా పెరిగిపోతున్న జనాభాను అరికట్టడమే. 1987 జూలై 11న ప్రపంచ జనాభా ఐదు బిలియన్లకు చేరుకుంది. ఆ రోజును ప్రపంచ జనాభా దినంశగా ఐక్యరాజ్యసమితి గుర్తించింది. అప్పటి నుంచి క్రమం తప్పకుండా ఏటా జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవంశ జరుపుకుంటున్నాం.

వలసలు పెరగడంతో మరింత సమస్య..

ఆధ్యాత్మిక నగరం తిరుపతి జన ప్రభంజనంతో నిండిపోతోంది. 2011 లెక్కల ప్రకారం నగర జనాభా 2.25 లక్షల మేర ఉండగా 2022 నాటి 7 లక్షలకు చేరింది. ఇందుకు ప్రధాన కారణం గ్రామీణ నిరుద్యోగం, వ్యవసాయ రంగం పూర్తిగా క్షీణించడం. దీంతో గ్రామీణ ప్రాంతాల నుంచి ఉపాధి, ఉద్యోగం, విద్య కోసం రాయలసీమలో పలు జిల్లాలతో పాటు పలు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో వలసలు రావడమే నంటున్నారు నిపుణులు.

2027 నాటికి 10 లక్షలకు చేరే అవకాశం

1950లో తిరుపతి జనాభా 24,833 మంది మాత్రమే ఉండేది. ఇది ప్రస్తుతం స్థానికులు, వలసదారులతో కలపి 2025 నాటికి 7,75,455 లక్షలకు పెరిగింది. గత ఏడాదిలోనే 22,771 మంది పెరిగినట్లు సమాచారం. దీంతో నగర వార్షిక వృద్ధి రేటు 3.02 శాతంగా ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం తిరుపతి జనాభా 2.25 లక్షలు ఉండగా 2025 నాటి 7.75 లక్షలు చేరినట్లు సమాచారం. అధికారుల అంచనా ప్రకారం 2027 నాటి 10లక్షల మార్కును దాటుతుందని అంచనా వేస్తున్నారు.

మితిమీరితే ఏర్పడే సమస్యలు

- జనాభా పెరుగుదలతో ప్రకృతి సమతుల్యం దెబ్బతింటుంది.
- సహజ వనరులు, అడవులు అంతరించిపోతాయి.
- పేదరికం, నిరుద్యోగం తాండవిస్తుంది
- ఆకలి కేకలు, జీవన ప్రమాణ స్థాయి తగ్గడం
- తరాల మధ్య అంతరాలు పెరగడం
- ట్రాఫిక్, పర్యావరణ సమస్యలు పెరిగడం
- మానవుని ఆయుఃప్రమాణ స్థాయి తగ్గడం
- సమతౌల్య పోషికాహార కొరత
- నివాస ప్రాంతాల పరిధి భారీస్థాయిలో పెరగడం

తిరుపతి అర్బన్ జనాభా వివరాలు (స్థానిక, వలసదారులు)

సంవత్సరం	జనాభా (లక్షల్లో)
2021	5.99
2022	6.31
2023	6.40
2024	6.71
2025	7.01

2027నాటికి 10 లక్షలకు చేరుతుందని అంచనా

నగర విస్తీర్ణం 2011 ప్రకారం	27.44 కిమీ
జనసాంద్రత (స్క్వయర్ కి.మీ.కి)	38,170
సరాసరి అక్షరాస్యత	84.51శాతం
పురుషుల అక్షరాస్యత	89.01 శాతం
స్త్రీల అక్షరాస్యత	82.81 శాతం
స్త్రీ, పురుష నిష్పత్తి	966 : 1000

నియంత్రణ అవసరం



పరిమిత వనరులు ఉన్న నగరంలో జనాభాను నియంత్రించుకోవాల్సిన అవసరం ఉంది. ఈ బాధ్యతను ప్రభుత్వాలే కాదు.. ప్రజలు స్వీయ ఆచరణలో పెడితే జనాభా పెరుగుదలను నియంత్రించవచ్చు. ప్రస్తుతం ఉన్న పరిమిత వనరులను భావితరాలకు అందించవచ్చు. నగరం విస్తీర్ణతలో వెనుకబడి ఉంది. కానీ జనాభా రోజురోజుకు విరీతంగా పెరుగుతుండడంతో భవిష్యత్ ఆగమ్య గోచరమే.

– ప్రసాద్‌రావు, రిటైర్డ్ కేంద్ర ప్రభుత్వ ఉన్నత స్థాయి అధికారి, తిరుపతి

ఇబ్బందులు తప్పవు



భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జనాభా నియంత్రణ కార్యక్రమాలు పెద్ద సంఖ్యలో చేపట్టాల్సిన అవసరం ఉంది. ప్రజలను చైతన్య వంతులను చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. గ్రామీణ ప్రాంతాల నుంచి వలసలను ఆపే ప్రయత్నంలో భాగంగా అక్కడే వారికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పించే పరిస్థితి ఏర్పడాలి.

– సత్యవతి, రిటైర్డ్ అధ్యాపకురాలు, తిరుపతి

నోటీస్ బోర్డు

- లక్ష్మీపురం సర్కిల్, కెనడీ నగర్‌లోని భవిష్య నిధి(పీఎఫ్) కార్యాలయంలో మధ్యాహ్నం 12 గంటలకు ఎంప్లాయిమెంట్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీమ్ పథకంపై పీఎఫ్ కమిషనర్ మీడియా సమావేశం
- తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో సాయంత్రం 6 గంటలకు తిరుచ్చిపై ఊరేగుతూ భక్తలకు దర్శనమివ్వనున్న అమ్మవారు
- శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో సాయంత్రం 6 గంటలకు శ్రీఆండాల్ అమ్మవారు, శ్రీపుండరీక వల్లి అమ్మవారు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమివ్వనున్నారు.

పుష్పయాగం రేపు

తిరుపతి అన్నమయ్య సర్కిల్ : అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం పుష్ప యాగం జరగనుంది. ఇందులో భాగంగా శుక్రవారం రాత్రి 7.30 నుంచి 8 గంటల మధ్య శాస్త్రోక్తంగా అంకురార్పణ కార్యక్రమం నిర్వహించనున్నారు. గురువారం టీటీడీ అధికారులు పత్రికా ప్రకటన విడుదల చేసింది. జూన్ 7 నుంచి 15వ తేదీ వరకు శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు జరిగిన విషయం తెలిసిందే. అయితే ఈ ఉత్సవాల్లో ఏవైనా లోపాలు జరిగి ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహిస్తారు.

ఎన్ఎస్‌యూలో ఉచిత సంస్కృత బోధన

తిరుపతి సిటీ: స్థానిక జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో బాలకేంద్రాలను ఏర్పాటు చేసి గత ఏడేళ్లుగా చిన్నారులకు సంస్కృత భాషపై ఉచిత బోధన అందిస్తున్నట్లు బాల కేంద్రం డెరెక్టర్ డాక్టర్ సీతారామశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఈ ఏడాది సైతం 5 నుంచి 15 ఏళ్ల వయస్సులోపు చిన్నారులకు శని, ఆదివారాల్లో సాయంత్రం 5.30 నుంచి 7 గంటల వరకు ఉచితంగా సంస్కృత భాషను నేర్పించడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పిల్లలకు సంస్కృత భాషను నేర్పించేందుకు ప్రొత్సహించాలని కోరారు. వివరాలకు 8367476975, 9441316319 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వృత్తి విద్యాకోర్సులకు దరఖాస్తులు

తిరుపతి అన్నమయ్యసర్కిల్: ఏపీ నైపుణ్యాభివృద్ధి, న్యాక్ శిక్షణా శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న వృత్తి విద్యాకోర్సులకు సంబంధించి ఎస్సీ యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవాలని తిరుపతి సెట్విన్ సీఈఓ మోహన్ కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. 38 రోజుల శిక్షణా కాలంలో ఉచితం భోజన వసతులు కల్పిస్తారన్నారు. డిజిటల్ మార్కెటింగ్, ఫ్రంట్ ఆఫీస్ అసిస్టెంట్ కోర్సులకు ఉచితంగా శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. 15 నుంచి 45 సంవత్సరాలలోపు 10 నుంచి డిగ్రీ వరకు విద్యార్హత కలిగిన వారు అర్హులన్నారు. దరఖాస్తుకు ఆధార్, కుల ధ్రువీకరణ జిరాక్స్‌తో పాటు రెండు ఫొటోలు జతపరచాలన్నారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) ట్రెనింగ్ సెంటర్, ఎస్వీ మెడికల్ కాలేజీ ఎదురుగా, అలిపిరి రోడ్డు తిరుపతికి దరఖాస్తులు పంపాలన్నారు. సమాచారం కోసం 7981155147, 9989245224, 9966489502 నంబర్లను సంప్రదించాలని కోరారు.

వేడుకగా మహా చండీహోమం

తిరుపతి కల్చరల్: పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో గురువారం వేడుకగా మహాచండీహోమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులకు అమ్మవారి ప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ జయకుమార్, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

యాలమూరి మృతి పార్టీకి లోటు


నివాళులర్పిస్తున్న భూమన కరుణాకరరెడ్డి


నివాళులర్పిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ యాలమూరి శ్రీనివాసులురెడ్డి మృతి పార్టీకి తీరనిలోటు అని చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి నియోజకవర్గ సమన్వయ కర్త భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. గురువారం యాలమూరి శ్రీనివాసులురెడ్డి మృతికి గజమాలలతో వారు నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

శిక్షణ పూర్తి


శిక్షణ పూర్తిచేసుకున్న డ్రైవర్లకు ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న ఎంవీఐ సుబ్రమణ్యం, అలిపిరి డీఎం హరిబాబ

తిరుపతి అర్బన్: అలిపిరి డ్రైవింగ్ స్కూల్‌లో హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కోసం శిక్షణ తీసుకుంటున్న డ్రైవర్లు శిక్షణలో మెలకువలు తెలుసుకోవాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుబ్రమణ్యం తెలిపారు. గురువారం అలిపిరి డిపో పరిధిలోని డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న 33వ బ్యాచ్‌కి వీడ్కోలు పలికారు. అలాగే 34వ బ్యాచ్‌కి శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంవీఐ, అలిపిరి డిపో మేనేజర్, డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపల్ హరిబాబు మాట్లాడుతూ 35వ బ్యాచ్‌కి శుక్రవారం నుంచి దరఖాస్తులు అందిస్తామని వెల్లడించారు. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తులు పొందవచ్చని స్పష్టం చేశారు. ఒక్కో బ్యాచ్‌కి 16 మందికి మాత్రమే శిక్షణ ఉంటుందని.. 32 రోజులు మాత్రమే ట్రైనింగ్ ఇస్తామని వివరించారు. ఇప్పటి వరకు అలిపిరి డ్రైవింగ్ స్కూల్‌లో 33 బ్యాచ్‌లో 528 మందికి శిక్షణ ఇవ్వడంతోపాటు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొందదానికి అర్హత పత్రాన్ని ఇస్తామని.. ఆ పత్రం ద్వారా ఆర్టీఓ ఆఫీస్‌లో లైసెన్స్ పొందారని స్పష్టం చేశారు. ఆసక్తి ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులు గోపాల్, ఎంవీ నాయుడు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు నిర్మించండి

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం మోడల్ స్కూల్ ఆవరణలో అదనపు మరుగుదొడ్లు నిర్మాణం చేయించాలని పిల్లల తల్లి దండ్రులు ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి, సర్పంచ్ చెరకుల జనార్దన్ యాదవ్‌కు విన్నవించారు. గురువారం జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు హాజరైన పిల్లల తల్లిదండ్రులు స్థానిక సమస్యలను కమిటీతో పాటు అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తెచ్చారు. 72 మంది విద్యార్థులు చదువుతున్న మోడల్ స్కూల్‌లో పిల్లలకు అవసరమైన మరుగుదొడ్లు, తరగతి గదులు లేవన్నారు. తల్లిదండ్రులు తెలిపిన సమస్యలపై స్పందించిన ఎంపీపీ చంద్రమోహన్ రెడ్డి అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం అక్కడి పిల్లలకు పలకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు మహమ్మద్ రఫీ, శంకరయ్యతో పాటు తల్లి దండ్రుల కమిటీ చైర్మన్, సభ్యులు పాల్గొన్నారు.

న్యాయవాది మృతికి సంతాపం

తిరుపతి లీగల్: తిరుపతి న్యాయవాది ఎం. సుబ్రహ్మణ్య యాదవ్ బుధవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సందర్భంగా గురువారం తిరుపతి కోర్టు ఆవరణలోని స్థానిక మూడవ అదనపు జిల్లా జడ్జి కోర్టు హాల్లో న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. తిరుపతి మూడవ అదనపు జిల్లా జడ్జి ఎం గురునాథ్, తిరుపతి న్యాయవాదుల అసోసియేషన్ అధ్యక్షుడు గజేంద్ర పలువురు న్యాయవాదులు దివంగత సుబ్రహ్మణ్యం యాదవ్ సేవలను కొనియాడుతూ ప్రసంగించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సంతాప సభలో అదనపు జిల్లా జడ్జిలు, సీనియర్ సివిల్ జడ్జిలు, జూనియర్ సివిల్ జడ్జిలు, న్యాయవాదులు పాల్గొన్నారు. గురువారం న్యాయవాదులు విధులకు హాజరు కాలేదు.

గురువేన్నమః


ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ప్రిన్సిపల్ సత్యనారాయణ


పాకాల జూనియర్ కళాశాలలో నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

బాబాకు ప్రత్యేక పూజలు



తిరుపతి తుడా: స్థానిక శివజ్యోతి నగర్‌లోని శ్రీరామసాయి ఆలయంలో గురువారం ఘనంగా గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించారు. ఆలయ కమిటీ నేతృత్వంలో భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం సాయిబాబా విగ్రహ ఊరేగింపు నిర్వహించారు.

విద్యార్థిలో అజ్ఞానాన్ని పారదోలి వెలుగులు నింపే మహోన్నత వ్యక్తి గురువు మాత్రమే అని.. గురువును గౌరవించినప్పుడే విద్యార్థికి సంపూర్ణ జ్ఞానంతో కూడిన విద్య లభిస్తుందని పలువురు వక్తలు తెలిపారు. తిరుపతి, చంద్రగిరిలోని షిర్డీ సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. అలాగే కళాశాలలు, స్కూళ్లలో విద్యార్థులకు వ్యాసరచ పోటీలను నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

తిరుపతి సిటీ/చంద్రగిరి/పాకాల

తుడా పరిశీలన


తుడా అభివృద్ధిపై ఆర్కిటెక్చర్ ప్రొఫెసర్లతో చర్చిస్తున్న తుడా చైర్మన్

తిరుపతి తుడా: రానున్న ఐదేళ్లలో తిరుపతి నగర పరిధిని మరింత విస్తరింప చేయాలన్న లక్ష్యంతో జాతీయ అంతర్జాతీయ ప్రమాణాలతో తుడా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నామని తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి తెలియజేశారు. తుడా అభివృద్ధిపై స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ విద్యాలయం ప్రొఫెసర్లు గురువారం తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తుడా అధికారులు తుడా పరిధిలో చేపడుతున్న ప్రాజెక్టులను, అభివృద్ధి పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. అనంతరం శెట్టిపల్లి భూములను తుడా అధికారులతో కలిసి పరిశీలించారు.

పెత్తనమంతా ఆ ముగ్గురిదే..!

- తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో భక్తురాలిపై ఓ అధికారి అనుచిత ప్రవర్తన
- ఉన్నతాధికారులకు తెలిసినా చర్యలు శూన్యం

చంద్రగిరి: తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో ఒకే సామాజికవర్గానికి చెందిన ఓ ముగ్గురు అధికారులే పెత్తనం చెలాయిస్తున్నారు. ఎంతలా అంటే వారు తప్పు చేస్తే ఉన్నతాధికారులు సైతం వారిపై చర్యలు తీసుకోలేనంతంగా. రెండు రోజుల కిందట తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని దర్శనానికి వచ్చిన ఓ భక్తురాలి పట్ల ఆలయంలో విధులు నిర్వహిస్తున్న ఓ అధికారి దురుసుగా ప్రవర్తించడంతో పాటు దుర్భాషలాడాడు. దీంతో ఆ మహిళ కన్నీటి పర్యంతమై, అక్కడే ఉన్న అధికారితో పాటు సిబ్బందిని నిలదీశారు. దర్శనానికి వచ్చే భక్తులతో ఇలా వ్యవహరిస్తారా ? అంటూ మండిపడ్డారు. దీంతో ఉన్నతాధికారులు ఆమెను బయటకు పిలిపించి రాజీకి యత్నించారు. ఆపై ఆమెకు మరోసారి దర్శనం చేయించి, అమ్మవారి పూజా పుష్పాలు అందజేసి శాంతింపజేశారు. ఈ తతంగం అంతా ఆలయంలోని సీసీ కెమెరాలో రికార్డు అయినట్లుగా తెలుస్తోంది. ఘటన జరిగి మూడు రోజులు అయినా ఇప్పటి వరకు టీటీడీ ఉన్నతాధికారులు సదరు అధికారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ఆలయంలో భిన్న వాదనలు వినిపిస్తున్నాయి.

కిందిస్థాయి ఉద్యోగులపై ఆ ముగ్గురి జులుం..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పద్మావతి అమ్మవారి ఆలయంలో ఆ ముగ్గురు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి. ఆలయంలో వారు చెప్పినట్లు వినకపోతే తీవ్రంగా వేధిస్తున్నట్లుగా తోటి ఉద్యోగులు తీవ్ర ఆవేదనకు లోనవుతున్నారు. గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో వారి కుటుంబ సభ్యులు తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చిన సమయంలో సదరు అధికారి అనుచితంగా ప్రవర్తించినట్లు తెలుస్తోంది. దీంతో అప్పట్లో అతన్ని దూర ప్రాంతానికి బదిలీ చేశారు. ప్రస్తుతం అమ్మవారి ఆలయానికి బదిలీపై వచ్చిన ప్పటి నుంచి మళ్లీ భక్తులు, సిబ్బంది పట్ల దురుసుగా వ్యవహరిస్తుండడంతో ఆలయ ప్రతిష్టకు భంగం కలుగుతోంది.

కోటీశ్వరుల రుణమాఫీతో లక్ష కోట్లు అవినీతి

తిరుపతి కల్చరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదేళ్ల కాలంలో కోటీశ్వరులకు రూ.14.50 లక్షల కోట్ల రూపాయలను రుణమాఫీ చేసి లక్షల కోట్ల రూపాయలకు అవినీతికి పాల్పడిందని మాజీ ఎంపీ చింతామోహన్ ఆరోపించారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్‌పీఏ అసెట్స్ అవినీతి ప్రధాని మోదీ సాధించిన ఘనత అన్నారు. గుజరాతీలో కోటీశ్వరుల రుణమాఫీతో వారికి అండగా నిలిచి, ఎన్‌పీఏ మాఫీలో 10 శాతం డబ్బులు తీసుకోవడంతో లక్ష కోట్లు అవినీతి దాటిందని తెలిపారు. ఈ అవినీతిలో సూత్రధారులు, పాత్రధారులు ఎవరో తేల్చి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వ్యభిచార గృహంపై దాడి

తిరుపతి క్రైమ్ : నగరంలో వ్యభిచార గృహంపై అలిపిరి పోలీసులు దాడికి పాల్పడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. అలిపిరి పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కర్ణాటకకు చెందిన కుమార్ అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తపల్లి వద్ద ఉన్న సుజాత నగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని వ్యభిచారం నిర్వహిస్తుండేవాడు. పక్కా సమాచారంతో పోలీసులు దాడి చేసి కుమార్‌తో పాటు మరో విటుడు, బెంగళూరుకు చెందిన ఇద్దరు మహిళలు, రాజమండ్రికి చెందిన మహిళను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన మహిళలను ప్రభుత్వ వసతి గృహానికి తరలించగా విటుడుతో పాటు కుమార్‌ను అరెస్ట్ చేశారు.

గంగమ్మకు పూజలు



తిరుపతి మంగళం: తిరుపతి పరిధిలోని శెట్టిపల్లిలో నిర్వహించిన గంగమ్మ జాతరలో గురువారం చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు భూమనకు ఆశీర్వాదం చేసి తీర్థప్రసాదాలను అందించారు. అనంతరం పార్టీ నాయకులు ఆయనను సత్కరించారు.

వీధి వ్యాపారులను ఆదుకోండి

తిరుపతి కల్చరల్: వీధి వ్యాపారుల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వారి సమస్యలు పరిష్కరించి మౌలిక వసతులతో ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి డిమాండ్ చేశారు. వీధి వ్యాపారుల సంఘం నగర మహాసభ గురువారం సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి నగరంలో సుమారు 6 వేల మందికిపైగా వీధి వ్యాపారులు ఉన్నారని, వారికి గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో వీధి వ్యాపారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ శివకుమార్, నగర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, వ్యాపారులు పాల్గొన్నారు.